# మిస్టర్ పతి!

"అమ్మో! .... అయ్యో .... అమ్మో!" కేకలు పెడుతూ అరుస్తున్నాడు వాడు.

"నీయవ్వ! కొట్టి కొట్టి నా సేతులు నొత్తున్నాయ్ కానీ, నీకు బుద్ధిరాదు గదరా, గాడిదకొడకా!" మరోసారి బాదింది లచ్చి.

ఈ హృదయవిదారకమైన దృశ్యం చూసి కరిగిపోయాడు బి. బి. పతి, ఐ. ఏ. ఎస్.

"డ్రైవర్! కారాపు" అరిచాడు పిడుగు పడ్డట్టుగా.

డ్రైవర్ సడన్ బ్రేకు వెయ్యడంతో కారు కాస్త అటూ ఇటూ కదిలి ఆగింది.

"అమ్మా! ఆ పిల్లాడిని ఎందుకలా కొడుతున్నావ్?" అడిగాడు కారులో నుంచే పతి.

లచ్చి ఆశ్చర్యంగా అతనికేసి చూసింది. నొక్కు నొక్కుల క్రాపూ, తీరైన కన్నూ ముక్కూ తీరూ, రంగు నలుపైనా కళైన మొహం- ఎవరో పెద్ద మనిషిలా ఉన్నాడు అనుకుంటూ, నోటమాటరాక ముంగిలా వుండిపోయింది. ఆ పిల్లాడు ఏడుపుస్థాయి తగ్గించాడే కానీ మానలేదు- దెబ్బలు తగిలినచోట చేత్తో రాసుకుంటూ కారులో వున్న అతణ్ని చూస్తూ.

మాట్లాడకుండా నుంచున్న ఆమెని చూస్తూ "అలా కొట్టొచ్చా?" అన్నాడు పతి. అప్పటికి తేరుకుంది ఆమె షాక్‌లోనుంచి. "నా పిల్లాడు, నా ఇష్టం. కొట్టుకుంటాను, సంపుకుంటాను- మధ్యలో మీరెవరు? అయిగా కారులో కూకుంది కొట్టొచ్చా తిట్టొచ్చా అని నీతులు సెబుతావున్నారు. కట్టాలంటే దొరబాబులు

మీకేం తెలుత్తాయి? కాలేకడుపులు మాకు తెలుత్తాయి." మనసులో వున్న బాధంతా వెళ్ళబోసుకుంది లచ్చి.

పతి కారు దిగాడు. కళ్ళజోడు సవరించుకున్నాడు.

"చూడమ్మా, నీ పేరేమిటి?" అడిగాడు శాంతంగా.

"లచ్చి. అయినా నాపేరుతో మీకేం పని? మల్లా ఎలక్చన్లు గిన్లా ఒత్తన్నాయా ఏంటి? ఇంత ప్రేమగా మా గుడిసికాడ కారాపి మాట్టాడతా వున్నారు!" చేతులు తిప్పుకుంటూ అంది లచ్చి.

పతి నవ్వాడు.

"బాబూ, నీ పేరేంటి?" పిల్లాడికేసి చూసి నవ్వుతూ అడిగాడు. వాడు ఏడుపుమాని కళ్ళు తుడుచుకుంటూ "బిచ్చమయ్య" అన్నాడు.

పతి ఉలిక్కిపడ్డాడు. వెంటనే తేరుకుని "మీ అమ్మ నిన్ను ఎందుకొట్టుతోంది? అల్లరిచేశావా?" బుజ్జగిస్తూ అడిగాడు.

ఎన్నడూ అంతటి ప్రేమని చవిచూడని ఆ పిల్లాడు ఆశ్చర్యంగా అతనికేసి చూస్తూ "ఇయ్యాల పనికి పోనన్నానని కొడ్తన్నది"అన్నాడు అమాయకంగా. పతి గుండె క్షణం క్షణం కరిగి నీరవుతోంది.

"పనికి ఎందుకు పోనన్నావ్?" మళ్ళీ అడిగాడు పతి.

వాడు మాట్లాడలేదు. మౌనంగా నుంచున్నాడు తలొంచుకుని.

"ఇస్కోలికి పోతడట! అడ ఓ గిలాస పాలు బోస్తరు తాగిరానీకి. ఏందంటే సదువుకుంటన్నా అంటడు పోరగాడు. పాలు పాడుగాను. ఒక్క గిలాస తాగితే అయిపోతదా? పనికిబోతే నాల్రూపాలొత్తాయ్. ఈ ఇస్కోల్లో పాలిచ్చి మా పానాలు తీత్తంద్రు." స్కూలుని తిట్టిపోసింది లచ్చి. జేబులోంచి కర్చీపు తీసి కళ్ళు తుడుచుకున్నాడు మిస్టర్ బి. బి. పతి, ఐ. ఏ. ఎస్. అతని హృదయం కరిగి, నీరు కారుతోంది.

"లచ్చి! మీ బాబుని మా ఇంట్లో పనికి పెడతావా? నీకు కావలసిన జీతం ఇస్తాను. వాడి అవసరాలు నేను చూసుకుంటాను." అడిగాడు పతి.

లచ్చి నోరు తెరిచి చూసింది అతనివంక.

"మీ ఇల్లెక్కడ?" అడిగింది కాస్సేపటికి

"ఇక్కడి నుంచి రెండు సందుల అవతల, రామాలయం దగ్గర."

"ఏం పని సెయ్యాలేటి?"

"ఏవో చిన్న చిన్న పన్లు. అమ్మగారి చేతికిందుండాలి. మాకో చిన్న బాబున్నాడు. వాడితో ఆడుకోవాలి."

"మరి మావోడికి రోజూ నాల్రూపాలొత్తాయ్. మరిగాంటే...."నసిగింది లచ్చి.

"చెప్పు ఎంత కావాలో."

"మీ ఇట్టం! మీరే ఆలోసించి చెప్పండి."

"రోజుకి నాలుగు రూపాయలంటే నెలకి నూటా ఇరవై రూపాయలు. నేను నెలకి నూటాయాభై ఇస్తాను. నీకిష్టమేనా?"

అమాంతం లచ్చి అతని కాళ్ళమీద పడిపోయింది.

"లేమ్మా లే!" అంటూ లేవనెత్తాడు పతి.

లచ్చి ఏడుస్తూ "నువ్వు దేవుడవు దొరా! మమ్ముల రచ్చించడానికే ఒచ్చినవు. మా బిచ్చవయ్య నెలకి నూటయాబై రూపాయల కొలువు సేత్తదంటే నాకే నమ్మేటట్టులేదు. ఇగరారా పోరగా! అయ్యగారి కాల్లమీదపడు. దేవుడొచ్చినట్టొచ్చిండు దొర" అంటూ గబగబా వెళ్ళి వాణ్ణి తెచ్చి అతని కాళ్ళమీద పడేసింది. వాణ్ణి లేవనెత్తి "రేప్పొద్దున్నే ఒచ్చేసేయ్. లచ్చీ! ఎనిమిది గంటలకల్లా ఒచ్చేయండి" అంటూ వెళ్ళి కారెక్కి కూర్చున్నాడు పతి. గుండెలమీంచి యేదో బరువు దించినట్టయింది.

రథంలా కదిలిపోతున్న కారు కనుమరుగయ్యేంతవరకు చూస్తూవుంది లచ్చిమి. బిచ్చమయ్యనీ, లింగడినీ, నర్సమ్మనీ, గంగమ్మనీ చుట్టూ కూర్చోబెట్టుకుని, చంటిపిల్ల బాలమణికి పాలిస్తూ. ఆమె మనసు గాలిలో తేలిపోతోంది. నెలకి నూటాయాబై రూపాయలు! బిచ్చమయ్య అదుష్టమంతుడే అనుకుంటూ మురిసిపోయింది. పాలు ఎక్కువగా ఒచ్చేసినట్టున్నయ్. పొలమారి బాలమణి ఉక్కిరిబిక్కిరై దగ్గుతూవుంటే, ఆలోచనల్లోంచి తేరుకుని, బాలమణికి "ఓ ఓ ఓ" అంటూ వీపు రాసింది లచ్చి.

* * *

బి.బి. పతి, ఐ.ఏ.ఎస్. తన ఇంటి గేటు మీది బోర్డు చూడగానే మళ్ళీ ఆలోచనలన్నీ ముసురుకున్నాయ్ మనసుని.

"ఒరేయ్ బిచ్చుగా! యాడ సచ్చినవురా, నీ ఆలి ముండమొయ్యా! ఎన్ని సార్లు సెప్పాల్రా! ఇయ్యాల రాజాబాబుది పుట్టిన దినమట! దోస్తులొస్తుండ్రట! పాలు జల్దిన దెమ్మన్నది. రెండు పాకీట్లు ఎక్కువ దెమ్మన్నది. ఇచ్చిరా పోరా! పొద్దుబోతే తిడ్తది." దండకం వల్లించింది మీనమ్మ. మట్టిలో వేలుతో బొమ్మలు గీస్తున్న బిచ్చుగాడు ఏదో స్ఫురించినట్టు "అమ్మా! ఇయ్యాల రాజాబాబుది పుట్టిన దినమా?"

"అవ్." గుడిసె ముందు తుడుస్తు చెప్పింది మీనమ్మ.

"అమ్మా...."

"ఏందిరా! అమ్మా అమ్మా అని నా ఎంటబడ్తవ్? పో! పొద్దుబోతంది." ఉరుములా అరిచింది ఆమె.

వాడు కదల్లేదు. అక్కడే నుంచున్నాడు. తల్లి కేకలూ. తిట్లూ వాడికి వినపడ్డం లేదు. వినబడినా అవి రోజూ అలవాటే వాడికి. "రాజాబాబూ నేనూ ఒక్కనాడే పుట్టినమని జెప్పినవ్ కదా, అంటే ఇయ్యాల నా పుట్టినదినం కూడా!"

"ఓయబ్బో! మన మొకాలకి పుట్టిన దినాలుగూడనంట! మింగేతందుకు మెతుకులేదంట, మీసాలకు సంపెంగ నూనెనంట! పో....పో!" కసిరింది గట్టిగా మీనమ్మా. ఆ అరుపుకి భూమి కంపించినట్టయింది. వెంటనే వెళ్ళి పాల పాకెట్లు పెట్టిన సంచిని తీసుకుని బయల్దేరాడు బిచ్చుగాడు.

పెద్ద గేటులోంచి దారి కిరువైపులా పూచిన గులాబీచెట్ల తొట్టెలను దాటి, రకరకాల క్రోటన్ మొక్కల మధ్యనుంచి, వరండాలోంచి లోపలి కెళ్ళాడు బిచ్చుగాడు. ఆ గది ఎంతో అందంగా అలంకరించి వుంది, రోజా క్రన్న కూడా. గదంతా రంగురంగుల కాగితాల తోటి, బెలూన్ల తోటీ తోరణాలు కట్టినట్లుగా నిండివుంది. కుర్చీలు వరుసగా అమర్చి ఉన్నాయ్. రాజాబాబు సిల్క్ పైజామా, కుర్తా వేసుకుని, కొత్త బట్టలతోటీ, కొత్త చెప్పులతోటీ మెరిసిపోతున్నాడు. వాళ్ళ నాన్నగారు అప్పుడే షాపునుంచి తెచ్చిన బంగరు ఉంగరాన్ని రాజాబాబు చేతికి పెడుతూ ముద్దుపెట్టుకున్నారు అతడి

బుగ్గలమీద. "నాన్నగారి కాళ్ళకు దణ్ణం పెట్టమ్మా!" అంది పెద్దమ్మగారు, అంటే రాజాబాబు నాయనమ్మగారు. రాజాబాబు వంగి దణ్ణం పెట్టేడు. తల మీద అక్షింతలు వేస్తూ "బాగా చదువుకుని ఐ.ఏ.ఎస్ ఆఫీసరువి కావాలి" ఆశీర్వదించారు లక్ష్మీకాంతరావుగారు.

ఇదంతా చోద్యంగా చూస్తూ నిల్చున్నాడు బిచ్చగాడు. "ఏయ్, రాజా చంద్ర! హాపీబర్త్‌డే" అంటూ రాజాబాబు స్నేహితులు, పెద్ద పెద్ద ప్యాకెట్లు అతని చేతిలో పెడుతూ, రాజాబాబు అందించిన స్వీట్లూ, కేకూ తింటున్నారు.

కేకు కట్ చెయ్యడం దగ్గరినుంచి, అంతా వింతగా చూస్తూ నిల్చుండి పోయాడు బిచ్చగాడు. "రాజాబాబు పూర్తిపేరు రాజాచంద్ర" నొక్కి నొక్కి పలుకుతూ, మనసులోనే మననం చేసుకున్నాడు పదేపదే. మరి తన పూర్తి పేరో? అమ్మనడగాలి. అమ్మ తనకి ఒక కొత్త చొక్కా లాగూ కూడా కొనలేదు. తనూ రాజాబాబూ ఒక్కరోజే పుట్టారట. రాజాబాబు తనకంటే ఒక్క గంట పెద్దవాడట. అంతే. ఒక్క నిమిషం వాడి బట్టలకేసి చూసు కున్నాడు. చింకి చొక్కా, చింకి లాగూ, దుమ్ముపట్టిన వొళ్ళు, తైలసంస్కారం లేని జుట్టు.

ఇంకెవరో కార్లో వొచ్చారు. పెద్ద బహుమతి తెచ్చిచ్చారు. "బాగా చదువుకోవాలి. ఐ.ఏ.ఎస్. ప్యాసయిపోవాలి" అన్నాడాయన.

"ఐ.ఏ.ఎస్." బట్టీపట్టాడు బిచ్చు. దాని అర్థం ఏమిటో తెలీలేదు. రేపు బడికెళ్ళి మాస్టార్నడగాలి.

వాడి చేతిలో ఒక కేకుముక్కా, ఇంత బూందీ తీసుకొచ్చి పెట్టింది రాజా బాబు తల్లి. "ఇంకవెళ్ళు" అంది, వాడు అందుకే నుంచున్నట్టుగా. బిచ్చుకి బాధ కలిగింది. గిరుక్కున తిరిగి వెళ్ళిపోయాడు.

"అమ్మా! రేపటినుంచి నేను పాలకి పోను."

ఆశ్చర్యంగా చూసింది మీనమ్మ. "ఎందుకని?" అడిగింది.

"సదువుకోను బడికి పోతా."

"సచ్చినోడికి సోకులు యిట్టినట్టున్నాయ్! బంగ్లకిబోయి రాంగనే ఏందో, తల తిరుగుతుందా ఏంది?"

పొయ్యిలో కట్టెలు మండక పొగ చుట్టుకుపోతుంటే ఊదుతూ అంది మీనమ్మ.

బిచ్చు మాట్లాడలేదు. వాడి బుర్రనిండా ఆలోచనలే. ఉన్నట్టుండి "అమ్మా! నా పేరు బిచ్చుగాడేనా? ఇంకేమన్నా వున్నదా? రాజాబాబు పేరు రాజా చం.... ద్ర.... సంట."

"నీ పేరు బిచ్చపతి!" అంది పళ్ళెంలో అన్నంబెట్టి, కారం తొక్కు వేస్తూ.

"బిచ్చపతి." మళ్ళీ ఆలోచిస్తూ కూర్చున్నాడు.

"తిందువు రా." అరిచింది తల్లి.

"నాయిన రానీ" అన్నాడు బిచ్చు.

"నాయినిప్పుడొస్తాడు! రా తిందువు, పొద్దుపోతంది." పిలిచింది.

ఇక లాభం లేదని రెండు మెతుకులు తిని లేచాడు.

తండ్రి తాగి రావడంతో మీనమ్మ అరుపులు అతనిమీద వడ్డాయ్.

బిచ్చు గోనెసంచి పరుచుకుని పడుకున్నాడు. మనసునిండా ఆలోచనలు, అవ్యక్తమైన కోరికలు....తెల్లవార్లూ జాగరణే చేశాడు ఇంచుమించు.

*　　　*　　　*

పొద్దున్నే స్నానం చేసి, ఉతికిన బట్టలు వేసుకుని వెళుతున్న కొడుకుని చూసి "యాడికిరా! కొలువుకి బోవా?" అన్న మాటలు వినిపించుకోకుండానే వెళ్ళిపోయాడు బిచ్చు.

వాణ్ణి చూసి ఆశ్చర్యంగా "ఏరా, ఇలా ఒచ్చావ్?" అడిగారు కామేశ్వర్రావు మాస్టారు.

"సార్! నాకు సదువుకోవాలనుంది."

"చాలా సంతోషం. ఇవ్వాళ్ళనుంచే బడికిరా."

బిచ్చు మాట్లాడలేదు.

"ఏరా! ఇవాళ కుదరదా?"

"సార్! నాతాన పైసల్లేవు పుస్తకాలకి, జీతానికి."

"ఆ గొడవ నీకెందుకు? మీ నాన్ననో, అమ్మనో రమ్మను. నేను మాట్లాడతాను."

"సార్! అక్కరరారు. నేను ఇస్కూలుకి రావడం అల్లకిష్టం లేదు. నేను కొలువుజేసి పైసలియ్యాలి అల్లకి."

కామేశ్వర్రావు మాస్టారి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"నీ బట్టలూ, పుస్తకాలూ, జీతం నేను చూసుకుంటాను."

"కానీ, నేను కొలువుజెయ్యాలి కదా?" కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాడు బిచ్చు.

"నువ్వు కొలువుజేస్తే ఒచ్చే జీతమెంత?" అడిగారు మాస్టారు.

"ముప్పై రూపాయిలు."

"అవీ నేనిస్తాలే! నువ్వు మా ఇంట్లోనే వుండి చదువుకో." బిచ్చు అతని కాళ్ళమీద పడ్డాడు. మాస్టారు నవ్వుతూ, "బాగా చదువుకో" అని ఆశీర్వదించారు.

* * *

హాల్లో మాస్టారి ఫోటో నవ్వుతూ కనిపించింది. "భిక్షపతీ! నువ్వు ఇంత ఎత్తు ఎదిగినా, నన్ను మంచిపోకుండా, నా అడుగుజాడల్లో నడుస్తున్నందుకు నాకెంతో గర్వంగా వుందయ్యా!" ఫోటో మాట్లాడి నట్టనిపించింది. దగ్గరికి వెళ్ళాడు. "ఒక దీపం వెయ్యిదీపాలు వెలిగించాలి! ఒక విద్యావంతుడు, కనీసం మరొక విద్యావంతుణ్ణి తయారు చెయ్యాలి." మాస్టారి మాటలు, బంగారు భిక్షపతి ఐ. ఏ. ఎస్. చెవుల్లో రింగుమన్నాయి! అప్రయత్నంగా ఫోటోలో మాస్టారి పాదాలకి నమస్కరించాడు పతి.

"యేమిటి సంగతి? రాగానే మాస్టారుకి నమస్కారం చేస్తున్నారు?" అడిగింది అరుంధతి.

జరిగినదంతా చెప్పాడు పతి.

అరుంధతి కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి.

బాధతో కాదు!....

దుఃఖంతో కాదు!....

ఆర్ద్రతతో! ఆప్యాయతతో! అనురాగంతో!....

"యేమండీ! మీలాంటి మనసున్న మనిషి, గురువుగారిమీద దేముడిమీదకన్నా ఎక్కువ భక్తిగల వ్యక్తి, కోటికి ఒక్కరున్నా చాలు - నీతి భూమ్మీద ఇంకా నిలబడుతుంది" అంటూ గుండెమీద తల ఆనించింది ఆనందంతో.

"అరుంధతీ! వీటన్నిటికీతోడు, తలపెట్టిన కార్యాలకి అడ్డుపడకుండా చేయూతనిస్తూ, అండగా నిలిచే అనుకూలవతి అయిన భార్యకూడా అందరికీ దొరుకుతుందా? అందరూ అరుంధతిలా వుంటే?"

"పొండి మరీ పొగిడేస్తున్నారు."

"ఊఁ. అయితే యేదీ పప్పీ ఇవ్వు. ఎప్పుడూ వాడికేనేంటి? బబ్లూగాడు పుట్టి రెండేళ్ళు కాలేదు. వాడు 'పప్పీ' అనగానే ముద్దులు కురిపించేస్తావ్ నేను

సీనియర్ నోయ్! వాడు నాకంటే ఎంత జూనియరో, అయినా వాడే గెలుస్తాడు. వాణ్ని చూస్తుంటే నాకు జెలసీగా వుంది" అన్నాడు అధరాలలోని మధువు నందుకోబోతూ పతి.

"మమ్మీ, నా డాల్ యేదీ?" అంటూ ఒచ్చిన బబ్లూని చూసి, తక్కున వెనక్కి జరిగింది అరుంధతి నవ్వుతూ.

ఒక్క నిముషం కోపం వొచ్చినా, వెంటనే అరుంధతి నవ్వులతో తనూ శృతి కలిపాడు పతి.

ఆ గదంతా నవ్వులు ప్రతిధ్వనించాయి.

మాస్టారి ఫోటోకూడా చిలిపిగా నవ్వింది, ఈ నవ దంపతులని చూసి, ఈ చిలకా గోరింకలని చూసి అరుంధతీ నక్షత్రం వెల వెలపోయింది, ఈ అభినవ అరుంధతి ముందు.

"మే ఐ కమిన్ సార్!" వరండాలోనుంచే దండం పెడుతూనుంచున్న అతణ్ణి చూసి నవ్వుతూ "ఎస్" అన్నాడు పతి.

"సార్! నేను ఎ.ఎస్.పి. విజయవాడ సార్, నన్ను ఈ ఊరికి - విశాఖ పట్నం ట్రాన్స్‌ఫర్ చేశారు సార్! రేపే రిపోర్టు చెయ్యాలి. మా ఎస్.పి.గారు లీవులో వున్నారు సార్! మా ఆవిడకి ప్రసవించే రోజులు. ముగ్గురు చిన్నచిన్న పిల్లలు. ఇంట్లో చేసే వాళ్ళెవ్వరూ లేరు. మీరు దయదలచి ఒక పదిహేను రోజులు లీవిప్పిస్తే.... అందుకనే ముందు కలెక్టర్ గారిని కలుసుకుందామని వొచ్చాను. సార్! కాదనకండి. ఇవి చేతులు కావు.'' ప్రాధేయపడుతున్న అతన్ని చూసి "మీ పేరు?'' అడిగాడు పతి.

"రాజాచంద్ర.''

ఉలిక్కిపడ్డాడు పతి. నోటమాటరాలేదు. సరేనన్నట్టుగా తలూపాడు.

రాజాచంద్ర "థాంక్స్ సార్'!' అంటూ వెళ్ళిపోయాడు.

"ఏ లోకంలో వున్నారు సార్! మర్చిపోయారా, మనం సినిమాకెళ్దామను కున్నాంగా?'' అంది అరుంధతి.

"ఒస్తున్నా'' అంటూ లేచాడు పతి.

సినిమా చూస్తున్నంత సేపూ రాజాచంద్ర రూపమే కళ్ళకి కట్టినట్లు కనబడుతోంది పతికి. పండిపోయిన జుట్టు, ఊడిపోయిన పళ్లూ, ముసలాడిలా వున్నాడు తనముందు.

సినిమా చూస్తున్నా అతని ఆలోచనలు మాస్టారిపైనా, రాజాచంద్రపైనా తిరుగుతూ, చిన్నప్పటి సంఘటనలు కళ్ళముందు మెదులుతున్నాయి - సినిమా రీళ్ళలా తిరుగుతున్నాయి బుర్రలో. *